## చైనా వస్తువులను నిషేధించాలి

కర్నూలు : చైనా దేశానికి చెందిన వస్తువులను నిషేధించాలని కోరుతూ భజరంగ్‌దళ్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భజ రంగ్‌దళ్ నాయకులు వేద ప్రకాశ్, భాను ప్రకాశ్‌లు మాట్లాడుతూ... చైనా దేశానికి సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవద్దన్నారు. నిత్యం భారత్‌తో కయ్యా నికి కాలు దువ్వుతున్న చైనాకు ఆ దేశ వస్తువులను బహిష్కరించి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.


## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఆస్పరి: రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు నాగేంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయం ఆవరణలో రైతు కోరికల దినోత్సవం సందర్భంగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ... ఉల్లి, టమోట ధరలు గణనీయంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే రైతులు ఆత్మ హత్యలు చేసేకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన చెందారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

# నవ రత్నాల్ని ఇంటింటికీ తీసుకెళ్లండి

**- వైకాపా జిల్లా అధ్యక్షుడు బాలినేని**



ఒంగోలు : విజయవాడ ప్లీనరీలో వైకాపా అధ్యక్షుడు ప్రకటించిన నవరత్నాల ప్రచారాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరావు కార్యకర్తలకు సూచించారు. ఒంగోలులోని సీతారామ ఫంక్షన్ హాలులో నవరత్నాల సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలినేని మాట్లాడుతూ నవరత్నాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా చూస్తామన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటమికి బాధపడాల్సిన అవసరం లేదన్నారు. అక్కడ తెదేపా విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. గతంలో జరిగిన ఎన్నికల్లో తెదేపాకు డిపాజిట్లు కూడా రాలేదని గుర్తుచేశారు. పార్టీ నగర కమిటీ అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు మాట్లాడుతూ ఒంగోలులో ప్రభుత్వ పాలన అవినీతిమయంగా మారిందన్నారు. కార్యాలయాలు, పోలీసు స్టేషన్లలో పచ్చచొక్కాలు తిష‘వేసి కమిషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. నగరానికి కేటాయించిన జీ ప్లస్ అపార్టు మెంట్లను అధికార పార్టీ నాయకులే పంచుకుంటున్నారన్నారు. పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చుండూరి రవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందన్నారు. వీధివీధికి మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలను మత్తులో నింపుతున్నారన్నారు. సభలో వైకాపా నాయకులు కుప్పం ప్రసాద్, కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కఠారి శంకర్, రాయపాటి అంకయ్య, పోకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతో పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

నెల్లూరు : కేంద్ర ప్రభుత్వం నిధులతో నెల్లూరు ప్రాజెక్ట్ కింద చేపట్టిన పనులను నిరీ?త కాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ముత్యాలరాజు పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యా లయంలో ఈవిషయంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ ప్రాజెక్ట్ పనుల్లో కొన్నైనా అక్టోబర్ నెలలో ప్రారంభించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద పరిశ్రమల యాజమాన్యం పాఠశాల లకు కంప్యూటర్లు ఇస్తోందని ఆయా పాఠశాల లకు ఎన్నికంప్యూటర్లు కావాలో వివరాలు పంపాలన్నారు. కసుమూరు, వెంకటాచలం రోడ్డు నిర్మాణం సెప్టెంబర్ 15వ తేదిలోగా పూర్తి చేయాలన్నారు. నడికుడి, శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కోసం భూసేకరణ వివరాలు తెలుపాలన్నారు. మొగళ్ల పాళెం స్పోర్ట్స్‌కాంప్లెక్స్ తదితర అంశాలపై కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, డీఆర్వో వెంకటసుబ్బయ్య, సీపీవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు తిరుపతి ఎంపీ వినతి

సూళ్లూరుపేటలో సబ్‌వే నిర్మాణం, అందుకు అవసరమైన భూమి, ఏపీ దత్తత తీసుకున్న కనుపూరు గ్రామాభివృద్ధి తదితర అంశాలపై తిరుపతి ఎపీ వరప్రసాద్ కలెక్టర్ ముత్యాల రాజుకు వినతి పత్రం సమర్పించారు. గూడూరులోని 40 ఎకరాల భూమిలో సిరామిక్ ప్యాక్టరీని ఏర్పాటు తదితర అంశాలపై ఆయన చర్చించారు.

# కృష్ణా అంత్య పుష్కరాలు ప్రారంభం



ఆత్మకూరు : కొత్తపల్లి మండలం పరిధిలోని సప్తనదీ సంగమేశ్వర క్షేత్రంలో అంత్య పుష్కర వేడుకలను ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా కృష్ణవేణమ్మ నదీమ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ మాట్లాడుతూ బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించే సమయాన కృష్ణానదికి ఆరంభ పుష్కరాలు జరిగాయని అదేవిధంగా బృహస్పతి కన్యారాశి నుంచి నిష్క్రమించే సమయాన అంత్య పుష్కరాలు జరుగు తున్నాయని తెలిపారు.

బృహస్పతి కన్యారాశి నుంచి నిష్క్ర మించే చివరి 12 రోజులు ఇవి ఉంటాయన్నారు. సెప్టెంబర్ 11 వరకు 12 రోజుల పాటు వీటిని నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. నది వద్ద రుష్య శృంగజపం, వరుణ జపం, రుద్ర జపాలు చేశారు. ఆవుపాలతో వృష్యశృంగ మూల మంత్రాలతో వరుణ జపం నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు, కుంభవృష్టితో వర్షాలు కురిసి నదీమ తల్లి పరవళ్లు తొక్కేందుకు, రాష్ట్రంలోని జలా శయాలు, చెరువులు, డ్యామ్‌లు, కుంటలు నిండుటకు కృష్ణా, తుంగభద్రా నదులు భారీ ప్రవాహాలతో ముందుకు కదిలేందుకు వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నేడు 1,800 విగ్రహాలతో నిమజ్జనోత్సవం

## ప్రశాంతతకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

కర్నూలు : నగరంలో సెప్టెంబర్ 2న వినాయక నిమజ్జనోత్సవం మొదలవుతుందని గణేశ్ ఉత్సవ సమితి నాయకులు కపిలేశ్వ రయ్య, నగరాధ్యక్షుడు క్రిష్టన్నలు తెలిపారు. గురువారం స్థానిక వినాయక దేవాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. రాంబొట్ల దేవాలయం వద్ద తొలి విగ్రహం పూజలు అందుకున్నాక వూరేగింపుగా బయలుదేరి సరిగ్గా మధ్యాహ్నం 3.30 గంటలకు నిమజ్జన ప్రదేశానికి చేరుకుంటుందని వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి పూజచేసి ఉత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు. నగర పరిధిలోని ఇతర వినాయక విగ్రహాలను కేటాయించిన సమయానికే వూరేగింపుగా తీసుకురావాలని స్థానిక నాయకులకు సూచించారు. మద్యపానం పూర్తిగా నిషేధించామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు కేంద్ర కమిటీ బాధ్యత వహించదన్నారు. మొత్తం 1800 విగ్రహాలు వినాయక ఘాట్‌కు తరలిరానుండగా పదిచోట్ల నిమజ్జనం జరుగుతుందని, 200 వరకు సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారన్నారు. మహిళల కోసం ప్రత్యేక దర్శన ప్రదేశం ఏర్పాటు చేశామన్నారు. బక్రీద్ దృష్ట్యా ముస్లింలపై రంగులు చల్లవద్దని సూచించారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జనోత్సవం జరగడానికి స్థానిక కమిటీలు సహకరించాలని కోరారు. చిన్నా రుల భద్రత దృష్ట్యా వారి జేబుల్లో చిరునామా, చరవాణి వివరాలతో కూడిన చీటిని ఉంచాలన్నారు. 800 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని, విజేతలకు ఈ సందరరేగా బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. భక్తుల వినోదం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వేడుకల్లో విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు రాఘవరెడ్డి, శాసన సభ్యులు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు టీజీ వెంకటేశ్, బుట్టా రేణుక, కలెక్టర్ సత్య నారాయణ, ఎస్పీ గోపినాథ్ జెట్టిలతోపాటు ప్రముఖ రాజకీయ నాయకులు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో గణేశ్ ఉత్సవ సమితి నాయకులు రంగస్వామి, హరీష్‌బాబు, కాళింగి నరసింహవర్మ, సందడి సుధాకర్ పాల్గొన్నారు.

# భద్రతపై సదస్సు



బిట్రగుంట : బోగోలు మండలంలోని బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో భద్రతపై సదస్సు జరిగింది. ఈసదస్సుల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ ధనుంజయ మాట్లాడుతూ ప్రమాదాలకు అవకాశం లేకుండా పని చేయాలని సిబ్బందికి సూచించారు. కొంతకాలంగా విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో జరిగిన పలు తప్పిదాలను ప్రస్తావించారు. అవి పునరావృతం కాకుండా చూసుకోవడానికి అవసరమైన సూచనలు కూడా చేశారు.

విజయవాడ రైల్వే డివిజనల్ సేఫ్టీ కౌన్సిల్ సభ్యులు పలు ప్రమాదాలు జరిగిన తీరు, వాటిని అధిగ మించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైల్వే డ్రైవర్లు, గార్డులు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ తన ప్రత్యేక సెలూన్ నుంచి రైలుకట్టల పటిష్టత తదితరాలపై తనిఖీ చేశారు.

# రూ.10 లక్షల విలువైన ఎరువుల సీజ్

ముప్పవరం : మండలంలోని ముప్ప వరంలోని ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుఆకస్మికంగా దాడులు చేశారు. విజయదుర్గా ఫాస్పేట్, ఫెర్టిలైజర్స్ దుకాణం, గోదాముల్లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ.10 లక్షలు విలువైన మోనో అమ్మోనియం ఫాస్పేట్ (ఎం.ఎ.పి)ని సీజ్ చేశారు. అమ్మకాలు నిలిపేశారు. రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శంకరరెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించామని దాడులకు ఆధ్వర్యం వహించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సుప్రజ తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ... ‘ఇక్కడ చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఎరువులను రీప్యాకింగ్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ ఎరువు నాణ్యత పరీక్షలకుగాను నమూనాలు సేకరించాం. ప్రభుత్వ అనుమతి లేని సుమారు రూ.10 లక్షలు విలువగల ఎం.ఎ.పి ఎరువుల నిల్వలను సీజ్ చేశాం. విక్రయాలను నిలిపేశాం. దుకాణం గోదాముల యజమాని వేటూరి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశాం’ అని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.టి.నాయక్, ఎఫ్.ఆర్.ఒ. ముక్కంటి బాబు, వ్యవసాయ శాఖ ఏవోలు వేణుగోపాలరావు, నిర్మలాదేవి, ఎస్.ఐ. వెంకట్రావు పాల్గొన్నారు.

కల్తీ సమాచారం తెలియజేయండి

గ్రామాలు, పట్టణాలు... ఎక్కడ ఆహార పదార్థాలు, ఎరువులు, పురుగుమందులు, ఇంకా ఇతరత్రా కల్తీ వినియోగ వస్తువుల సమాచారం తెలిసినా వెంటనే 9701385091, 9701385092 చరవాణి నెంబర్లకు సమాచారం అందించాలని డీఎస్పీ సుప్రజ కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

# ఆరు నెలల్లో ఆదర్శ పోలీసు స్టేషన్ల నిర్మాణం పూర్తి



పాణ్యం : కర్నూలు జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో 6 నెలల్లో ఆదర్శ పోలీసు స్టేషన్ల నిర్మాణాలు పూర్తి చేసి సేవలను అందుబాటులోకి తెస్తామని ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. పాణ్యంలో ఆదర్శ పోలీసు స్టేషన్ నిర్మాణానికి గురువారం ఐజీ, ఎస్పీ గోపినాథ్ జెట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లాలో పాణ్యంతో పాటు కర్నూలు తాలుకా పోలీసు స్టేషన్‌ను ఆదర్శ స్టేషన్‌గా తీర్చిదిద్దనున్నామన్నారు. ఒక్కో దాని నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి బందోబస్తు, ఇతర కార్యక్రమాలతో విశ్రాంతి లేక ఇబ్బందిగా ఉందని, సిబ్బంది కొరతపై ద ృష్టి సారించామన్నారు. వారంలో ఒక రోజు సెలవు తీసుకోవడానికి ఇప్పటికే అవకాశం ఉందన్నారు. మద్యం బెల్టు దుకాణాలు ఎక్కడైనా నిర్వహిస్తుంటే నేరుగా తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ రవిప్రకాశ్, కర్నూలు డీఎస్పీ రమణమూర్తి, డీఈ సత్యనారాయణ, సీఐ పార్థసారథిరెడ్డి, ఎస్సై చిరంజీవి, జడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు చేరువగా పోలీసు సేవలు

ప్రజలకు చేరువై మెరుగైన సేవలందించేందుకు పోలీసుశాఖ నూతన కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు ఎస్పీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు పరిధిలో కర్నూలు గ్రామీణ మోడల్ పోలీసుస్టేషన్ భవన నిర్మాణానికి ఎస్పీ భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందరరేగా మాట్లాడుతూ నాలుగు వేల చదరపు అడుగుల స్థలంలో రూ.1.40 కోట్లతో పోలీసుస్టేషన్ నిర్మించనున్నట్లు వివరించారు. కర్నూలు గ్రామీణ పోలీసుస్టేషన్‌కు సొంత భవనం లేనందున అనువైన ప్రదేశంలో శాశ్వత భవనం నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలీసు హౌసింగ్ బోర్డు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించనుందని, పదిమాసాల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేష్, కర్నూలు డీఎస్పీ రమణమూర్తి, ఆదోని డీఎస్పీ కొల్లి శ్రీనివాసరావు, డీఈ సత్య నారాయణ, ఆర్‌యూ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సీఐలు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలల్లో సౌందర్య వికాస వృత్తిశిక్షణ కోర్సు

జూపాడుబంగ్లా : ఆంధ్రప్రదేశ్‌లోని 126 ఆదర్శపాఠశాలల్లో బాలికలకు ఒకేషనల్ కోర్సు కింద బ్యూటీవెల్‌నెస్ (సౌందర్య వికాస వృత్తిశిక్షణ) నేర్పిస్తున్నట్లు రాష్ట్ర సమన్వయకర్త రఘుకాంత్ అన్నారు. ఆయన స్థానిక ఆదర్శ పాఠశాలలో అమలవుతున్న కోర్సును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థినులు చదువుతో పాటు ఈ కోర్సు నాలుగేళ్లలో పూర్తి చేసినట్లయితే పాలిటెక్నికల్ కళాశాలలో నేరుగా ఎటువంటి అర్హత పరీక్ష రాయకుండా రెండో సంవత్సరంలో చేరడానికి అర్హులన్నారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతో పాటు ఈ కోర్సు పూర్తిచేయాల్సి ఉందన్నారు. ఏటా ఒక పరీక్ష నిర్వహిస్తారన్నారు. నాలుగేళ్లలో కోర్సు పూర్తిచేసినట్లయితే వారికి ఇచ్చే ధ్రువపత్రం అంతర్జాతీయస్థాయిలో పనిచేస్తుందన్నారు. ఆదర్శపాఠశాలల్లో చదువుకునే వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ భవిష్యత్తులో తనకాళ్లమీద నిలబడే విధంగా తీర్చిదిద్దుతుందన్నారు. కర్నూలు జిల్లాలో జూపాడుబంగ్లా, పాములపాడు, బండి ఆత్మకూరు, కోసిగి, జూలకల్లు పాఠశాలలో ఈ కోర్సు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు.

# సీజన్‌లో శాస్త్రవేత్తలు ప్రత్యేక చొరవ చూపాలి

## ప్రస్తుతానికి పత్తిలో గులాబి పురుగు లేదు

నంద్యాల: పంటల సాగు కాలంలోని పరిస్థితులను తెలుసుకుని శాస్త్రవేత్తలు ప్రత్యేక చొరవ చూపాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహాయ సంచాలకులు డాక్టరు గోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక సమావేశంలో శిక్షణ, సందర్శన(టీఅండ్‌వీ) సమావేశం నిర్వహించారు. పంటల సాగులో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంటల సందర్శన, అవగాహన సదస్సులు అందుకు దోహదపడతాయని శాస్త్ర వేత్తలకు, సహాయ వ్యవసాయ సంచాలకులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ, ప్రస్తుత ఏడీఆర్ డాక్టర్ ఎం.సుబ్బారావు, జిల్లాలోని సబ్ డివిజన్ల సహాయ వ్యవసాయ సంచాలకులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పంటల స్థితిగతులను సంబంధిత ఏడీఏలు వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు ఎంతో అనుకూలంగా ఉన్నాయని జిల్లాలోని ఏడీఏలు తెలిపారు. పత్తి పంటలో ప్రస్తుతానికి గులాబి పురుగు లేదని వారు వివరించారు. సమావేశంలో తొలుత కర్నూలు ఏడీఏ రమణారెడ్డి ఆ సబ్‌డివిజన్‌లోని మండలాల వారీగా సాగు వివరాలను తెలిపారు. ప్రస్తుతం పంటల పరిస్థితి ఆశాజనకంగా ఉందని, 15 రోజులు వాన పడకపోతే పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. డోన్ పరిధిలోని ప్యాపిలిలో వర్షపాతం తక్కువగా నమోదైందని ఏడీఏ రాఘువరెడ్డి తెలిపారు. కేసీ కాలువ, తెలుగు గంగకు నీరు వస్తేనే వరిపంట సాగవుతుందని ఆళ్లగడ్డ ఏడీఏ వరప్రసాద్ తెలిపారు. లేకపోతే మినుము, శనగ. జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేస్తారన్నారు. తమ డివిజన్‌లో అదే పరిస్థితి ఉన్నట్లు నంద్యాల ఏడీఏ సుధాకర్ తెలిపారు. తమ డివిజన్లలో పరిస్థితి ప్రతికూలంగా ఉందని ఆలూరు, పత్తికొండ ఏడీఏలు రాజ శేఖర్, నారాయణనాయక్‌లు వివరించారు. ఆదోని, నంది కోట్కూరు, ఆత్మకూరు ఏడీఏలు తమ డివిజన్లలోని పంటల సాగు పరిస్థితిని వివరించారు.

# కొత్త యూనిట్‌తో చిన్నారులకు మెరుగైన వైద్యం

కర్నూలు : సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో కొత్తగా నియోనేటల్ యూనిట్ ఏర్పాటు చేయడంతో నవజాత శిశువులు మరింత మందికి మెరుగైన వైద్యచికిత్సలు అందించే వీలవుతుందని కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో 10 పడకలతో కూడిన కొత్త యూనిట్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.రామప్రసాద్, ఆసుపత్రి పర్యవేక్షకులు డా.చంద్రశేఖర్, చిన్నపిల్లల విభాగాధిపతి డా.రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల విభాగంలో పడకలకంటే చికిత్సలు పొందే చిన్నారులు ఎక్కువగా ఉన్నారని, ఒక్కో పడకపై ఇద్దరు ముగ్గురు చికిత్సలు పొందాల్సి వస్తోందని, కొత్త యూనిట్‌తో మరింత మంది చిన్నారులకు వైద్య చికిత్సలు అందించడానికి వీలవుతుందన్నారు. కార్య క్రమంలో సీఎస్ఆర్ఎంఓ డా.శ్రీరాములు, ఆసుపత్రి మేనేజర్ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు స్వైన్‌ఫ్లూ, డెంగీ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులకు సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో ఆయా విభాగాధిపతులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.రామప్రసాద్, ఆసుపత్రి పర్యవేక్షకులు డా.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# గణనాథునికి 144 రకాల ప్రసాదాలు

బిట్రగుంట : మండల కేంద్రమైన బోగోలు విజయగణపతి ఆలయ సమీపంలో ఏడు రోజుల పాటు పూజలందుకొన్న నిలువెత్తు గణనాథుడి విగ్రహానికి శాస్త్రోక్తంగా నిమజ్జనం జరిగింది. విగ్రహం వద్ద 144రకాల ప్రసాదాలు నైవేద్యంగా పెట్టారు. సూర్యనారాయణస్వామి పూజలు నిర్వహించాచారు. విఘ్నేశ్వరుని వద్ద ఉన్న లడ్డూకి వేలంపాట నిర్వహించగా చిగురుపాటి ఫ్రెండ్స్ రూ.20 వేలకు పాడారు. కోలాటం భక్తులను ఆకట్టుకుంది. యాదవపాళెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని విగ్రహానికి కూడా విశేష పూజలు జరిగాయి. కోలాహలంగా గ్రామ పెద్దల నడుమ గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. చెంచు లక్ష్మీపురంలో సంప్రదాయాలకు పెద్దపీట వేసి పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని అలరించాయి. అనంతరం తాటిచెట్లపాళెంలో విగ్రహాలకు నిమజ్జనం జరిగింది.

# రబీ సాగుకు 80 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు

ఒంగోలు : రానున్న రబీ సీజన్‌లో జిల్లాలో రైతులకోసం రాయితీపై 80 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు ఇవ్వడానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యవసాయశాఖ నుంచి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. గత ఏడాది మిర్చి ఎక్కువగా సాగవడంతో జిల్లాకు కేటాయించిన 75 వేల క్వింటాళ్ల విత్తనాల్లో 62 వేల క్వింటాళ్లే అమ్ముడయ్యాయి. మిర్చి పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఎక్కువమంది పప్పు ధాన్యం పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో 80 వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. జిల్లాలో సుమారు 90 వేల హెక్టార్లు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. 60 వేల క్వింటాళ్లు జేజీ-11 రకం, 20 వేల క్వింటాళ్లు కాగ్-2 రకం విత్తనాలు కేటాయించారు. అక్టోబరు నెల రెండోవారం నుంచి రైతులకు శనగలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# తీరప్రాంత రహదారి విస్తరణ నివేదిక సిద్ధం చేయండి

## అధికారులకు మంత్రి యనమల ఆదేశం



కాకినాడ : విశాఖ- చెన్నై పారిశ్రామిక నడవా అభివృద్ధిలో భాగంగా కాకినాడ పోర్టు నుంచి విశాఖపట్టణం వరకు నేషనల్ హైవే 16ను కలుపుతూ నిర్మించదలచిన నాలుగువరుసల తీర ప్రాంత రహదారి విస్తరణకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అధికారులను ఆదేశించారు. కాకినాడ గ్రామీణం తిమ్మాపురం అతిథిగృహంలో రోడ్లు భవనాలు, రాష్ట్ర రహదారి అభివృద్ధి సంస్థ అధికారులు, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుతో కలిసి నూతన బైపాస్ రోడ్డు వంతెన నిర్మాణాలపై మంత్రి యనమల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్అండ్బీ శాఖ ప్రతిపాదనల ప్రకారం వాకలపూడి లైటహౌస్ నుంచి నేమాం వరకు నూతన బైపాస్ రోడ్డుకు, సముద్రతీరం వెంబడి 4.3 కిలోమీటర్ల ఆరువరుసల రహదారి, వంతెన నిర్మాణం, ఉప్పాడ-అమీనాబాద్-కొనపాపపేట బైపాస్ రోడ్డు పనులకు భూమిని సేకరించాలి. దీనికోసం సంబంధిత గ్రామాల నుంచి భూమిని సేకరించే విషయంలో ప్రజల ఆస్తులకు నష్టంలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్అండ్బీ అధికారులకు మంత్రి సూచించారు. తొండంగి మండలం పెరుమాళ్లపురం కూడలికి బైపాస్ రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలు పరిశీలిం చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్అండ్బీ ఎస్ఈ సిఎస్ఎన్ మూర్తి, ఏపీ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధిలో ప్రతి పనికీ దస్త్రాలు తప్పనిసరి



సీతానగరం : ఉపాధి హామీ పథకంలో ప్రతి పనినీ నమోదు చేయడంతోపాటు పారదర్శకంగా ఉండేలా కొత్తగా తీసుకొచ్చిన దస్త్రాల వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఈ దస్త్రాలను నింపే కార్యక్రమం జిల్లాలో నూరుశాతం పూర్తయ్యిందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ మసకపల్లి శ్రీరంగనాయకులు అన్నారు. ఉపాధి పనులపై కొత్తగా తీసుకొచ్చిన ఏడు రికార్డులను కూడా అన్నిచోట్లా పూర్తిచేశామన్నారు. సీతానగరం మండల పరిషత్తు కార్యాలయంలోని ఉపాధి పనుల రికార్డులను ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కేంద్ర పరిశీలన బృందం జిల్లాలో ఉపాధి పనులపై పరిశీలన చేస్తుందన్నారు. ఎంపిక చేసిన కొన్ని మండలాలకు బృందం వెళ్లి రికార్డులను పరిశీలిస్తుందన్నారు. ఉపాధి పథకం వేతనదారులకు నూరు శాతం పనులు కల్పించేలా ఇప్పటికే 34 మండలాల్లో ప్రగతి సాధించామన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వరిసాగు పనులు ముమ్మరంగా ఉండడంతో ఉపాధి పనులకు కూలీలు తక్కువగానే వస్తున్నారన్నారు.

సీతానగరం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై పూర్తి చేసిన రికార్డులను పరిశీలిం చారు. చేసిన ప్రతి పనికీ సంబంధించి ప్రచార బోర్డులు ఉంచాలని సూచించారు. మొక్కల సంరక్షణ పట్ల మక్కువ చూపకపోవడంతో చాలా చోట్ల మోడువారుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని నాటిన మొక్కలను కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దబ్బాడ శ్రీనివాసరావు, ఏపీవో వందే సురేష్కుమార్ క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

# అనిశా వలలో అగ్నిమాపక అధికారి

కొత్తపేట: కొత్తపేట అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్.నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. అనిశా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెంకు చెందిన వైద్యుడు కె.సుధాకర్ తన ఆస్పత్రి భవనానికి సంబంధించి రెన్యువల్ చేసేందుకు 2016లో అగ్నిమాపక శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి అగ్నిమాపక అధికారి రూ.50,000 డిమాండ్ చేయగా ఆయన అనిశా అధికారులను ఆశ్రయించారు. దీంతో వారు శుక్రవారం దాడులు జరిపి రూ. 50,000 నాగేశ్వరరావు నుంచి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అనిశా డీఎస్పీ ఎన్.సుధాకర్ తెలిపారు.

# లోకరక్షణలో భాగస్వామి మరియతల్లి

కడప : లోకరక్షణలో భాగస్వామి.. మరియతల్లి అని మరియాపురం విచారణ గురువులు సగిలి ప్రకాశ్ అన్నారు. స్థానిక ఆరోగ్యమాత నవదిన జప పూజాప్రార్థనలో భాగంగా ఆయన సందేశం ఇచ్చారు. విశ్వాసపాత్రురాలైన మరియ మహిళా లోకానికి ఆదర్శమాతన్నారు. ఆమె అనుసరించిన మార్గం దైవమార్గం అని కొనియాడారు. దైవ వాక్యంలో పరిపూర్ణ విశ్వాసురాలైన మరియ శాంతి సమాధానం పొందిన మాతన్నారు. మాత అలంకరణ, భక్తి గీతాలాపన క్రీస్తు జ్యోతి సభ కన్యస్త్రీలు నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత యర్రగుంట్ల విచారణ గురువులు ప్రాన్సిస్ దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం ఆరోగ్యమాత పుణ్య క్షేత్ర గురువులు, తిరుణాల కమిటీ ఆధ్వర్యంలో గురువులు సగిలి ప్రకాశ్, ప్రాన్సిస్లను సన్మానించారు. కార్యక్రమం ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టరు జయన్న, తిరుణాల కమిటీ ఆధ్వర్యంలో జరిగింది.

# రాష్ట్రాభివృద్ధిలో విఘ్నాలు తొలగాలి

## గవర్నర్ నరసింహన్ ఆకాంక్ష

కాణిపాకం : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో విఘ్నాలన్నీ తొలగిపోయి.. వేగంగా పురోభివృద్ధి జరగాలని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు. కాణిపాకంలో వెలసిన స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని ఉదయం ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు, ప్రధాన అర్చకులు ధర్మేశ్వర్ గురుకుల్ రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం గవర్నర్కు స్వామివారి పట్టు వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను ఈవో అందించారు. మూషికమండపంలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించారు. ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్ వెంట జిల్లా అదనపు ఎస్పీ రాధిక, డీఎస్పీలు రామ్కుమార్, సుబ్బారావు, చిత్తూరు వెస్ట్ సీఐ ఆదినారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు ముల్లగూరి లత, సర్పంచి కేసీ మధుసూదన్రావు, తవణంపల్లె తహసీల్దార్ వరలక్ష్మి, ఆలయ ఏఈవో కేశవరావు, సూపరింటెండెంట్ స్వాములు, ఇన్స్పెక్టర్ రమేష్ ఉన్నారు.

# సమాజాన్ని సంస్కరించే రచనలు అవసరం

## మండలి బుద్ధప్రసాద్

తిరుపతి : సమాజాన్ని సంస్కరించే రచనలు రావాలి. అందుకు ప్రాచీన సాహిత్యాన్ని అనుసంధానం చేసుకుంటూ ఆధునికీకరణ జరగాలని శాసన సభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. డాక్టర్ పూర్ణచందు రచించిన పద్యానుభవం పుస్తకావిష్కరణ సభ స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో జరగ్గా.. మండలి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషిచేస్తోందని చెప్పారు. పూర్ణచందు రాసిన ఈ పుస్తకం భాషా సంపద కోసం ఇతర రాష్ట్రాలలో సందర్శించి సేకరించిన వివిధ అంశాలను పొందుపరిచేలా రాయడం అందరికీ ఉపయుక్తంగా ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, నిర్వాహకులు మస్తానమ్మ, శ్రీదేవి మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యం భాషకు జీవమన్నారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకులు సాకం నాగరాజ మాట్లాడుతూ తిరుపతిలో పుస్తకం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తితిదే అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, సమీక్షకులు సాంబశివరావు, సామల రమేష్బాబు, సుబ్బరాయులు మాట్లాడుతూ ప్రభుత్వం భాషాభివృద్ధికి నిధులు కేటాయించి, అకాడమిలను పునరుద్ధరించేలా చొరవ చూపాలన్నారు.

# వైభవంగా పుష్కర మహాకుంభాభిషేకం



వరదయ్యపాళెం : వరదయ్యపాళెంలో కర్ణానది తీరంలో వెలిసిన శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత త్రయంబకేశ్వర స్వామి దేవాలయ పునఃనిర్మాణంతో మహాకుంభాభిషేకం చేపట్టి 12 వసంతాలు పూర్తైన నేపథ్యంలో ఆగమశాస్త్ర ప్రకారం పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వరదయ్యపాళెం ట్రంకురోడ్డు నుంచి ఆలయం వరకు దారిపొడవునా విద్యుద్దీపాలతో అలంకరించారు. వివిధ దేవతల చిత్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పురోహితులు నల్లపెద్ది శివరామ ప్రసాద్ శర్మ బృందం, రాజేంద్రప్రసాద్శర్మ ఆధ్వర్యంలో మహాగణపతి పూజతో మహాకుంభాభిషేక ఉత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. సాయంత్రం కలశపూజలు చేపట్టి, అగ్రిప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం ఆలయంలో పుష్కర కుంభాభిషేక ఉత్సవాలను నిర్విఘ్నంగా కొనసాగించి, వేడుకలకు దుష్టశక్తుల నుంచి కాపాడాలని కోరుతూ చండీహోమం చేపట్టారు. దేవతల ఆశీస్సుల కోసం ఆవాహ దేవతల హోమాదులు, పూజలను శాస్త్ర1యుక్తంగా చేపట్టారు. ఆలయ పాలకవర్గ మండలి సభ్యులు గోదారి దామోదరం, సప్తగిరి గ్రామీణబ్యాంకు మేనేజరు బొప్పన మోహనమురళి, మాజీ సర్పంచి పన్నెం బాలసుందరం, ఎంఎం నారాయణస్వామిశెట్టి, కుమారస్వామిశెట్టి, చంచల్ కిరణ్ పారిక్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం

## జడ్పీ ఛైర్పర్సన్ చేతుల మీదుగా నియామక పత్రాలు



గుంటూరు : జిల్లా పరిషత్తు పరిధిలోని అర్హతగల స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్తు ఛైర్పర్సన్ జానీమూన్, జిల్లా విద్యాశాధికారి రఘు కుమార్లు కౌన్సెలింగ్ ప్రక్రియ పర్యవేక్షించారు. కౌన్సెలింగ్లో భాగంగా 31 ఖాళీలకుగాను నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతులకు నిరాకరించగా, రెండు బ్యాక్లాగ్ పోస్టులకు అభ్యర్థులు లేనందున 25 మందికి పదోన్నతులు కల్పించి పోస్టింగ్లు ఇచ్చారు.

అనంతరం పదోన్నతులు పొందిన వారికి నియామకపత్రాలు జడ్పీ ఛైర్పర్సన్ జానీమూన్ చేతుల మీదుగా అందజేశారు. కౌన్సెలింగ్ నిలిచిపోవడంపై జడ్పీ ఛైర్పర్సన్ జానీమూన్ మాట్లాడుతూ ఉపాధ్యా యులు, ఉపాధ్యాయ సంఘాలన్నా తనకు ఎప్పుడూ గౌరవమేనని, తన మాటలు వేరేవిధం గా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. నిబంధన లకు విరుద్ధంగా తాను వ్యవహరించమని తాను ఎప్పుడూ చెప్పనన్నారు. జిల్లాపరిషత్తు యాజ మాన్యం పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

గ్రేడ్-2 హెచ్ఎంల కౌన్సెలింగ్లో అవకాశం కల్పించాలని అడిగిన హలీంభాషాకు సంబంధించిన ధ్రువపత్రాలు విద్యాశాఖాధికారులు పరిశీలించారు. సదరు ఉపాధ్యాయునికి పదోన్నతి ఇచ్చేందుకు అర్హతలు లేవని నిర్ధారించారు. గ్రేడ్-2 హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.

# స్థలం కేటాయింపునకు మార్గం సుగమం

## ఏపీఐఐసీకి ఇచ్చిన జీవో రద్దు

నరసరావుపేట : స్థానిక జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం-కాకినాడ (జేఎన్టీయూ-కె) ఇంజినీరింగ్ కళాశాలకు స్థలం ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. నరసరావుపేట మండలం కాకాని వద్ద 108 ఎకరాలను గతంలోనే ఏపీఐఐసీ నుంచి రెవెన్యూ శాఖ సేకరించింది. అయితే వాటిని కేటాయిద్దామనుకునే సమయంలో రాష్ట్ర విభజన జరుగడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఐటీఐ, కేంద్రీయ విద్యాలయకు కూడా అక్కడే స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే వాటిపై కేసులు న్యాయస్థానంలో ఉండటంతో ఐటీఐ కళాశాలను నరసరావుపేట మండలం ములకలూరు వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించి స్థలం కేటాయించగా ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. తాజాగా ఏపీఐఐసీకి భూమి ఇస్తూ జారీ చేసిన జీవో 473ను ప్రభుత్వం రద్దు చేసి 389ను విడుదల చేసిందని ఆర్డీవో రవీందర్ తెలిపారు. ఇకపోతే జేఎన్టీయూకు 86.73, కేంద్రీయ విద్యాలయకు 10.55, ఐటీఐకు 4.72 ఎకరాలు కేటాయిస్తూ ప్రతిపాదనలు పంపాలని జిల్లా పాలనాధికారిని ప్రభుత్వం కోరిందని ఆయన చెప్పారు. అయితే న్యాయస్థానంలో ఉన్న సమస్య పరిష్కారం కావాల్సివుందని, జేఎన్టీయూ విషయంలో ఇబ్బంది లేదన్నారు.

# సూక్ష్మసేద్యంతోనే ఉద్యాన పంటలు

## ఏపీఎంఐపీ పీడీ విద్యాశంకర్



చిత్తూరు : జిల్లాలో సాగయ్యే ఉద్యాన పంటలు వందశాతం సూక్ష్మసేద్యం పద్ధతిలో సాగుకు చర్యలు చేపట్టాలని సూక్ష్మనీటిసాగు పథకం (ఏపీఎంఐపీ) పథక సంచాలకులు విద్యాశంకర్ పేర్కొన్నారు. స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో ఉద్యాన అధికారులు, సూక్ష్మసేద్యం ప్రాంతీయ అధికారులు, బహుళ ప్రయోజన అధికారులకు సూక్ష్మసేద్యం అమలుపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను ఉద్యాన హబ్గా మార్చడంతో పాటు లక్ష హెక్టార్లలో సూక్ష్మసేద్యం విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. బిందు, తుంపర్ల సేద్యంతో తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధ్యమవుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, ఇతరులు, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. జీఎస్టీ అమలుతో రైతాంగానికి ప్రయోజనమే తప్ప.. ఆర్థిక భారం లేదన్నారు. ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. సూక్ష్మసేద్యం ప్రయోజనాలు, ఆవశ్యకతపై గ్రామస్థాయిలో విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాగునీరున్న రైతులందరికి సూక్ష్మసేద్యం రాయితీలు వర్తింప చేయాలని సూచించారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి బయోమెట్రిక్ పద్ధతిలో అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. నిర్దేశిత సమయానికి పరికరాలు సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. డ్రిప్ కంపెనీలు పరికరాల సరఫరాలో ఆలస్యం, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తక్షణమే తమ దృష్టికి తేవాలన్నారు. అర్హులైన రైతులకు సకాలంలో పరికరాలు సరఫరాచేసి అమర్చాలని సూచించారు. అనంతరం సూక్ష్మసేద్యం ప్రయోజనాలు, పథకం అమలు, ప్రగతి తదితర అంశాలపై పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏపీడీ మురళీమోహన్రెడ్డి, నెటాఫిన్ సాంకేతిక అధికారి సుబ్బారావు, ఉద్యాన అధికారులు, సూక్ష్మసేద్యం ఏరియా అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్పందించకుంటే లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులతో

# చేపడతాం చలో అమరావతి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



వినుకొండ : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఇప్పటి వరకు 146 మంది డబ్బులు రాలేదన్న దిగులుతో చనిపోయారని, ఇంకెంత మంది ప్రాణాలు బలి తీసుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బాధితుల చైతన్యయాత్రలో భాగంగా అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు చేపట్టిన బస్సు యాత్ర వినుకొండ చేరింది. అగ్రిగోల్డ్ బాధితులు, ఆ పార్టీ కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు. అనంతరం శివయ్య స్థూపం సెంటర్లో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. బాధితులను 120 రోజుల్లో ఆదుకుంటామని శాసనసభలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆరు నెలలు దాటినా పట్టించుకోలేదన్నారు. సెప్టెంబరు 17న అనంతపురంలో బస్సు యాత్ర ముగుస్తుందని, ఈలోపు ప్రభుత్వం స్పందించకుంటే లక్షల మంది బాధితులతో చలో అమరావతి నిర్వహిస్తామని చెప్పారు. అడ్డుకుంటే రహదారులపైనే వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల కోసం ప్రాణత్యాగానికి కూడా సిద్ధమని ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రకటించారు. ఎవరు అడగక పోయినా పండుగలకు కానుకల పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం 13 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు అడ్వాన్సుగా రూ.1180 కోట్లు ఇవ్వడానికి వెనకాడుతోందని ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. జప్తు చేసిన సుమారు రూ.3 వేల కోట్ల సంస్థ ఆస్తులను అమ్మి వచ్చిన డబ్బును జమ చేసుకోవచ్చునని సూచించారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలుంటే కేవలం నలుగురు మాత్రమే బాధితులకు అండగా ఉంటామన్నారని, మిగిలిన వారికి ప్రజల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. ఇటువంటి నాయకులు ఉన్నా లేకపోయినా ఒకటేనన్నారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఎన్నికలకు ముందు ప్రజలను దేవుళ్లుగా కొలుస్తారని, మిగిలిన రోజుల్లో దెయ్యాలుగా చూస్తారని విమర్శించారు. బాధితుల సంక్షేమ సమితి నాయకులు బీవీ చంద్రశేఖర్, వీవీ నాయుడు, సీపీఐ నియోజకవర్గ నాయకులు మారుతీవరప్రసాద్, సండ్రపాటి సైదా, లాల్ఖాన్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

